క్లుప్తంగా

పింఛన్ మంజూరు చేయండి మహాప్రభో


దివ్యాంగుడు బాలయ్యదొర

జి.మాడుగుల: ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా దివ్యాంగుడినైన తనకు అధికారులు పింఛన్ మంజూరు చేయడం లేదని మండలంలోని వంజరి గ్రామానికి చెందిన లకే బాలయ్యదొర అనే గిరిజనుడు వాపోయాడు. కుటుంబపోషణ కష్టంగా మారడంతో యాచనతో జీవనం సాగించాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేసి, ఆదుకోవాలని కోరాడు.

128 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అనంతగిరి(అరకులోయ రూరల్): అనంతగిరి ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్,విశాఖపట్నం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 128 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్టు స్థానిక వైద్యాధికారి జ్ఞానేశ్వరి తెలిపారు. మన్యప్రాంతంలో ఇటువంటి పరీక్షలు నిర్వహించడం గిరిజన ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఆమె చెప్పారు. ట్రస్టులు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ట్రస్ట్ సిబ్బంది గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైద్యులు మణికంఠ,గౌతమ్ పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి


పొలం బడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఉషారాణి

వై.రామవరం: పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉషారాణి అన్నారు. మండలంలోని చింతకర్రపాలెంలో మంగళవారం వెలుగూరి రాంబాబు అనే రైతు పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు కచ్చితంగా విత్తనశుద్ధి చేయాలన్నారు. విత్తన శుద్ధిపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

అరకులోయ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని స్థానిక బాలికల, బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్ నాయక్, పి.హెచ్.రామకృష్ణ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షాట్‌పుట్, రన్నింగ్, డ్రాయింగ్, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీ అప్పారావు, సిబ్బంది నాగబాబు, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం


ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ఉద్యోగులు

జి.మాడుగుల: మండలంలో నుర్మతి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నుర్మని సత్యనారాయణ మృతి చెందడంతో దహన సంస్కారాలకు నుర్మతి గ్రామ ఉద్యోగులు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. సత్యనారాయణ మాస్టార్ ఈనెల 12న విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గ్రామ ఉద్యోగులందరూ కలిసి దహన సంస్కారాలకు ఆర్థికసాయం చేశారు.

ముహూర్తమెన్నడో?

ముంచంగిపుట్టు జూనియర్ కళాశాల బాలికల కోసం నిర్మించిన వసతి గృహం నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు గడుస్తోంది. ప్రారంభానికి మాత్రం అడుగులు ముందుకు పడడంలేదు. కొన్నాళ్లు ఎన్నికల కోడ్, ఆ తరువాత మరేవో కారణాలు, ఇప్పుడు మళ్లీ ఎన్నికల కోడ్ అంటూ అధికారులు కాలక్షేమం చేస్తూ ప్రారంభోత్సవం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థినులు అవస్థలు పడాల్సి వస్తోంది.

- ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- పూర్తయిన పనులు
- విద్యార్థినులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు


ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహ భవనం

ముంచంగిపుట్టు: వసతి గృహం లేక స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ,ద్వితీయ సంవత్సరానికి చెందిన 180 మంది విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. కొంత మంది విద్యార్థినులు ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గృహాలు అద్దెకు తీసుకుంటే. మరి కొంత మంది తమ గ్రామాల నుంచి ప్రైవేట్ వాహనాలు,ఆర్టీసీ బస్సుల్లో గంటల తరబడి ప్రయాణం చేస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ పదేళ్ల కిందట చేపట్టిన వసతి గృహం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. విద్యార్థినుల అవస్థలు తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు వసతి గృహ నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపారు. అప్పటి ఐటీడీఏ పీవో గోపాలకృష్ణతో చర్చించి రూ.90లక్షలను మంజూరు చేయించారు. దీంతో ఎన్నో ఏళ్ల తర్వాత వసతి గృహానికి మోక్షం కలిగింది.శరవేగంగా పనులు పూర్తి చేశారు. ప్రారంభోత్సవ సమయానికి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు లోకి రావడంతో వాయిదా పడింది.ఎన్నికలు పూర్తయి,కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా ప్రారంభోత్సవం కోసం కళాశాల విద్యార్థులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భవనం ప్రారంభోత్సంపై అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా స్పందించి భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థులను కోరుతున్నారు.

వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలి



ప్రతి రోజు మా గ్రామం తమరాడ నుంచి 16 కిలోమీటర్లు ప్రయాణించి కళాశాలకు వస్తున్నాను. కొన్నిసార్లు ఆలస్యమైతే క్లాసులు మిస్ అవుతున్నాను. అధికారులు మా సమస్యలను అర్థం చేసుకుని వసతి గృహం ప్రారంభించాలి.

– జె.లేనినా, విద్యార్థిని,హెచ్ఈసీ, ద్వితీయ సంవత్సరం

అద్దె ఇంటిలో ఉంటున్నాం



మాది పెదబయలు గ్రామం. వసతి గృహం అందుబాటులోకి రాకపోవడతో ముంచంగిపుట్టులో అద్దె ఇంటిలో ఉంటూ కళాశాలకు వెళ్తున్నాను. ఆర్థిక సమస్యల కారణంగా అద్దె చెల్లించలేకపోతున్నాం. వెంటనే వసతి గృహాన్ని ప్రారంభించి,అందుబాటులోకి తెవాలి.లేకపోతే బాలికలంతా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– పి.కుమారి, పెదబయలు సీఈసీ విద్యార్థిని

త్వరలో అందుబాటులోకి వస్తుంది



విద్యార్థినుల సమస్యలను గిరిజన సంక్షేమశాఖ అధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ప్రారంభించడంలో ఆలస్యం అవుతోంది. త్వరలోనే వసతి గృహం అందుబాటులోకి వస్తుంది.

– కొండన్నదొర, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ముంచంగిపుట్టు

వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ పేదల పక్షమే

ఎంపీపీ వెంకటలక్ష్మి


ప్రజాప్రతినిధులు,నాయకులతో సమావేశమైన ఎంపీపీ గోము వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ పేదలపక్షాన్నే పనిచేస్తుందని స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి కేవలం పింఛన్ల పంపిణీకి మాత్రమే పరిమితమైందన్నారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం టీడీపీకి కొత్తకాదన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున పోరాడతామని చెప్పారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఇప్పటికే నిర్మించిన సీసీ రోడ్లు, జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, వైస్ ఎంపీపీలు రాజేశ్వరి, చంద్రరాణి, సర్పంచ్‌లు కొంగర మురళీకృష్ణ, ఆగూరి శుభలక్ష్మి, చీడి శివ, మిరియాల గణలక్ష్మి, సత్యవతి, చంద్రుడు, వెంకటలక్ష్మి, కాంతం, ఆదినారాయణ, వెంకటలక్ష్మి, శుభలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఆవగడ్డ నిర్మలదేవి, చిన్నాలమ్మ, అచ్చియమ్మ, కామేష్ నాయకులు దుర్గప్రసాద్, వెంకటరమణ, వీరబాబు, జాన్ బాబు, అర్జున్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం


బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సత్యసులోచనను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గంగవరం : ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసి కృష్ణా జిల్లాకు బదిలీపై వెళుతున్న తహసీల్దార్ సత్యసులోచనకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జిలాని, మండల సర్వేయర్ వీరప్పదొర, వీఆర్వోలు అప్పలకొండ రవి, వెంకన్న దొర, వెంకటేశ్వర్లు, గ్రామ సర్వేయర్లు లీలా కృష్ణ, చిన్నికృష్ణ తదితరులు బదిలీపై వెళుతున్న తహసీల్దార్ సత్య సులోచన అందించిన సేవలను వివరించారు. అనంతరం దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపిక అందజేశారు.

గంగవరం తహసీల్దార్‌గా వీరభద్రరావు



గంగవరం తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్న వీరభద్రరావుకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సత్య సులోచన కృష్ణా జిల్లా కలెక్టరేట్‌కు బదిలీపై వెళుతున్నారు. మంగళవారం గంగవరం తహసీల్దార్‌గా వీరభద్రరావు బాధ్యతలు స్వీకరించారు.

చింతపల్లి ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ప్రభావతి


బాధ్యతలు స్వీకరించిన ప్రభావతి

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణులు జి.ప్రభావతి నియమితులయ్యారు. సోమవారం రాత్రి ఏరియా ఆస్పత్రిని సందర్శించిన వైద్య శాఖ డైరెక్టర్ సెకండరీ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిషోర్ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో పలు పరిపాలన సమస్యలు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎముకల వైద్యనిపుణులు చంద్రశేఖర్‌రావును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆర్థికపరమైన ఇబ్బందులు కలగకుండా డీడీవోగా చంద్రశేఖర్‌ని కొనసాగించాలని ఆదేశించారు. ఈమేరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభావతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలి


వర్తక సంఘం నాయకులతో మాట్లాడుతున్న చింతపల్లి సీఐ రమేష్

చింతపల్లి: సమాజంలోని సమస్యల పరిష్కారానికి ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని సీఐ రమేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్తక సంఘం, ఆటో యూనియన్ సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఏ రంగంలో ఎవరెవరికి ఏ సమస్యలు ఉన్నా తమ శాఖకు తెలియపరచాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసు కార్యక్రమంలో భాగంగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. చింతపల్లి పట్టణంలో ఉన్న పలు సమస్యలను ఆయా రంగాలకు చెందిన వారు పోలీసులకు వివరించారు. ముఖ్యంగా చింతపల్లి మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని చెప్పారు. పాఠశాల, కళాశాలలో పోలీసు గస్తీ నిర్వహించాలని, ర్యాగింగ్ , మత్తు పదార్థాలు వంటి చెడు వ్యసనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తాటిపాకల నాగేశ్వరరావు, పెద్దిరెడ్డిల బేతాళుడు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, మోటర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొండచీపుళ్ల తయారీ ద్వారా ఉపాధి


చీపుళ్ల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

కొయ్యూరు: కొండచీపుళ్ల తయారీ ద్వారా మహిళలు ఉపాధి పొందవచ్చని సిఫా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ .శశిప్రభ అన్నారు. డౌనూరు పంచాయతీ గుమ్మనివానిపాలెంలో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కొండచీపుళ్ల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ మూడు రోజుల పాటు 15 మంది మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమన్వయకర్తలు రాజేశ్వరి,స్వప్న, తులసి, ట్రైనర్లు శ్రీనివాస్, సత్యనారాయణ, సంస్థ చెందిన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి


చిత్రపటానికి పూలమాల వేస్తున్న కళాశాల సిబ్బంది

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాల వేదిక వద్ద కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస పాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిషు అధ్యపకురాలు డాక్టర్ డి.కేజియా, లైబ్రరియన్ టి.భగత్‌రాయి, అసిస్టెంట్ లైబ్రరియన్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌలు పట్టాల పంపిణీ


రైతులకు కౌలు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: తామరపల్లి పంచాయతీ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న పలువురు కౌలు రైతులకు కౌలు పట్టాలను ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశీ కుంజం పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన ఈకార్యక్రమంలో వంశీ మాట్లాడుతూ రైతులు పంట వేసిన తరవాత తప్పని సరిగా పంట నమోద చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సత్యనారాయణ,అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్,చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఆనంద్‌కు ఎంపీ పరామర్శ


ఆనంద్‌ను పరామర్శిస్తున్న అరకు ఎంపీ తనూజ రాణి

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ పెదబయలు మండల అధ్యక్షుడు,ఎంపీటీసీ వంతల ఆనంద్‌ను మంగళవారం అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి పరామర్శించారు. ఆనందరావు కాలి ముడుకులో నీరు చేరడంతో కేజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. ఎంపీ వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


చింతూరులో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


అనంతగిరిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు, కళాశాల సిబ్బంది


అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చింతూరు: యువతీయువకులు మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం తెలిపారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం చింతూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అధ్యాపకులు పద్మ, శైలజ, నాగేశ్వరరావు, శ్రీలక్ష్మి,రాజాబాబు, రమేష్,సాయికుమార్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్ తెలిపారు. నషాముక్తభారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మార్పునకు యువతీయువకులు కీలకమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగబాబు, విజయలక్ష్మి, అనిత కుమారి, కొండబాబు, గణేష్ పాల్గొన్నారు.

అనంతగిరి(అరకులోయ రూరల్): డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ కె.రాము తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అవాటు పడి ఎవరూ జీవితలను పాడు చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజంనాయుడు, కళాశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

17న మండల పరిషత్ సమావేశం

జి.మాడుగుల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆర్.లోహిత్ జయసాగర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులు ప్రతిభను మెరుగు పర్చుకోవాలి


పోటీల్లో పాటలు పాడుతున్న విద్యార్థినులు

ఎటపాక: చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుండేందుకు విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని నేనుసైతం స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బుడిపిటి నాగార్జున అన్నారు. సాంతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం గౌరిదేవిపేట హైస్కూల్‌లో పాటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో 2011నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయులు, హోలీస్పిరిట్ సంస్థ కార్యదర్శి దారా రవి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం పరిశీలన


ప్రసంగిస్తున్న ఎస్ఐఆర్ శ్రీనివాస్‌రావు

రంపచోడవరం: సంపద తయారీ కేంద్రం వద్ద నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎస్ఐఆర్ డి.శ్రీనివాస్ రావు పరిశీలించి పలు సూచనలు చేశారు. మంగళవారం రంపచోడవరం మండలం ఫోక్సుపేటలో నిర్వహించిన శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఎస్ఐఆర్ డి.శ్రీనివాసరావు రైతులతో మాట్లాడారు. రెగ్యులర్‌గా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీవో కోటేశ్వరరావు ఎంపీడీవో బి.హరికృష్ణ పాల్గొన్నారు. అలాగే మారేడుమిల్లిలో కూడా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీరనారాయణంలో 104 వైద్య సేవలు

మాడుగుల: మండలంలోని వీరనారాయణం గ్రామంలో మంగళవారం 104 ద్వారా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రోగులతో పాటు వైరల్ జ్వరాలతో బాధపడుతున్న 170 మందిని గుర్తించి అవసరమైన మందుల్ని ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాద్‌పాత్రుడు, సిబ్బంది శంకరావు, రమణమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

85 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని చామగడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం 85 మంది విద్యార్థులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న కొంతమందిని గుర్తించి, వారు తీసుకోవలసిన పౌష్టికాహారం, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, ఆపాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు కొనసాగిన శిక్షణ


ఎరువులు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం 2వరోజు కొనసాగింది. ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన మంగళవారం ఫీల్డ్‌కు తీసుకు వెళ్లి పారిశుధ్యం తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. చెత్తతో ఎరువులు తయారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలో విద్యార్థులకు బహుమతులు


చిత్రలేఖన పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాజవొమ్మంగి : విజయవాడలో ఇటీవల జరిగిన చిత్రలేఖన పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు పొందారు. హారిక, హరి ప్రియ, కామేశ్వరి, సిరివల్లికలకు జ్యూరీ అవార్డులు లభించాయని హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో బహుమతులు పొందిన విద్యార్థులను హెచ్‌ఎం గోపాలకృష్ణ, డ్రాయింగ్ టీచర్ కొండబాబు తదితరులు అభినందించారు.